సురటి - ఆది

మంగళము గోవిందునకు జయ - మంగళము గరుడధ్వజునకును
మంగళము సర్వాత్మకునకు ధ - ర్మ స్వరూపునకూ జయ జయ

ఆదికి నాదైనదేవున - కచ్యుతున కంభోజ నాభున
కాదికూర్మంబైన జగ - దాధార మూర్తికిని
వేదరక్షకునకును సంతత - వేదమార్గ విహారునకు బలి
భేదికిని సామాదిగాన - ప్రియవిహారునకు

హరికి పరమేశ్వరునకు శ్రీ - ధరునకును కాలంతకునకును
పరమ పురుషోత్తమునకు - బహుబంధ దూరునకును
సురముని స్తోత్రునకు దేవా - సురగణ శ్రేష్టునకు గరుణా
కరునకును  కాత్యాయనీనుత - కలిత నామునకు

పంకజాసన వరదునకు భవ - పంక విచ్ఛేదునకు భవునకు
శంకరున కవ్యక్తునకు - నాశ్చర్య రూపునకు
వేంకటాచల వల్లభునకు - విశ్వమూర్తికి నీశ్వరునకును
పంకజాకుచకుంభ కుంకుమ - పంచలోలునకు జయజయ

మంగళము విష్ణుదేవుడు
మంగళ మైమ్మైదలంప మధురిపుడుద్య
న్మంగళ మంభోజాక్షుడు
మంగళమఖిలము, విహంగమధ్వజుడరయన్

అని తిక్కనగారి మంగళం భీష్మస్తవరాజ ఘట్టంలో, మంగళార్థం అన్నమాచార్యులు చాలా సంకీర్తనలు సంకలించారు. షష్ఠంతంగా చెప్పిన తిరు మంగళ సంకీర్తనమిది.

గోవిందునకు, సర్వాత్మకునికి, గరుడధ్వజునికి ధర్మ స్వరూపునికి జయమంగళం - జయజయమంగళం.

ఆద్యాది దేవునికి, అచ్యుతునికి, అబ్జనాభునికి, అబ్జనాభునికి, అది కూర్మమై జగత్తం తటికీ ఆధారమైన స్వరూపం గలవానికి, వేద రక్షణ మొనర్చిన మీనావతారునికి నిరంత ర వేదోక్త వధగామికి, బలి గర్వమణచిన వామనునికి, సామగాన సంగీత ప్రియునికీ మంగళం - జయమంగళం, హరికి, పరమేశ్వరునికి, శ్రీధరునికి, మృత్యునాశనమొనర్చే అక్షరునికి, పరమ పురుషుడైన పురుషోత్తమునికి, అనేక బంధాలకూ అతీతునికి, దేవర్షులచే స్తుతింపబడువానికి, దేవదానవులందరిలోకి శ్రేష్ఠుడైనవానికి, కరుణకు నిల యమైనవానికి, లలితా స్తోత్ర పాత్రునికి మంగళం - జయమంగళం.

బ్రహ్మాదులకు వరదానమొసగే, జనన మరణ దుఃఖపు పంకం తొలగించే భవ కార కునికి, భవునికి, శంకరునికి, అవ్యక్తునికి, ఆశ్చర్యంగొలిపే మూర్తి వైభవం గలిగిన శ్రీవేంక టాచల వల్లభుడైన విశ్వమూర్తికి, జగదీశ్వరునికి - శ్రీరమాకుచ కుంభాలపైనున్న కుంకుమ పంకంపై అంకిన ఇంకని పొంకపుటాసక్తిగల శ్రీస్వామికి మంగళం - జయజయమంగళం అని మంగళ సంకీర్తన మొనరించారు సంకీర్తనాచార్యులు.

శ్రియః కాంతాయ కల్యాణ నిధయే నిదయేర్థినాం
శ్రీ వేంకటనివాసాయ శ్రీనివాసాయ మంగళం